యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- కాలువలపై శ్లాబ్‌లతో వంతెనలు
- ప్రమాదంలో వరి ఆయకట్టు
- నిద్రావస్థలో ఇరిగేషన్ శాఖ

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో వరి సాగు ఆయకట్టు తీవ్ర ప్రమాదంలో పడింది. అసలే సాగు నీరు అందక, డ్రైనేజీ సక్రమంగా పని చేయక, పంట విరామంలో ఉన్న రైతులకు కాలువగట్లపై ఆక్రమణలు మరింత తలనొప్పిగా మారుతున్నాయి. ఇరిగేషన్ వ్యవస్థలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఇష్టానుసారం సాగుతున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలో మండల కేంద్రమైన మలికిపురంతో పాటు గుడిమెళ్లంక, విశ్వేశ్వరాయపురంలలో ఈ అడ్డగోలు నిర్మాణాలు రైతాంగాన్ని తీవ్ర కలవరపెడుతున్నాయి. వేసవి కావడంతో కాలువలకు నీరు నిలిపివేశారు. దీంతో పంటకాలువకు చేర్చి ఉన్న వ్యాపారులు, దుకాణదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు నివాస ప్రాంతాల ప్రజలు కూడా అడ్డగోలు నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు నిద్రావస్థలో ఉండడంతో ఈ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మలికిపురం మీదుగా వెళ్లే మొండి కోడు, మలికిపురం పంటకాలువలపై పూర్తిగా బల్ల వంతెనలు కట్టేశారు. ఇక ఇక్కడ పంటకాలువే కనబడడం లేదు. మోరి, మోరిపోడు, ఉయ్యూరి వారి మెరక వరి ఆయకట్టుకు ఈ పంట కాలువే కీలకం. ఇప్పటికే నీరందక ఈ కాలువ కింద ఆయకట్టు ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేదు. అధికారులకు ముడుపులు చెల్లించి ఇక్కడ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని కూడా ప్రచారంలో ఉంది. పంట కాలువలు కావడంతో గ్రామ పంచాయతీలకు వీటిపై పెత్తనం ఉండదు. దీంతో ఇరిగేషన్ అధికారులకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా అదృష్టం ఉందని భావిస్తున్నారు. అలాగే మలికిపురంలో గుడి


గుడిమెళ్లంక మూలపోడు పంట కాలువకు తూర వేసి, మళ్లీ ఆ తూరను కూడా మూసివేసి సాగుతున్న అక్రమ నిర్మాణం


మలికిపురంలో కాలువగట్టును ఆక్రమించి ఎవరికి వారే ఇష్టానుసారం కడుతున్న శ్లాబ్ కల్వర్టులు

మెళ్లంక వంతెన నుంచి మర్రిపేట వైపు రోడ్డులో అక్రమ లేఅవుట్లకు అడ్డగోలుగా అక్రమ వంతెనల నిర్మాణాలు సాగుతున్నా అధికారులకు పట్టడం లేదు. కనీసం కాలువ పూడికతీతకు అవకాశం లేకుండా అక్కడ కాలువలపై వంతెనలు నిర్మాణం చేసి కాలువలను పూర్తిగా మూసేస్తున్నారు. కాలువలపై వంతెన నిర్మాణం చేస్తే చాలు ఆ స్థలానికి అమాంతం రేటు పెరిగిపోవడంతో రియల్ వ్యాపారులు ఆ విధానం అమలు చేస్తున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులకు డిమాండ్ పెరిగి నిమ్మకుంటున్నారు. గుడిమెళ్లంక గ్రామం మూలపోడులో పి.గన్నవరం ప్రధాన కాలువకు చేర్చి వెళ్లే కాలువపై ఏకంగా నీరు వెళ్లే తూరను సైతం సగానికి ఆక్రమించి అక్రమ నిర్మాణం సాగుతుందంటే పరిస్థితి ఏ రకంగా ఉందో, ఇరిగేషన్ అధికారులు ఎంతటి ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారో అర్థం అవుతుంది. ఇక్కడ స్థలాలకు డిమాండ్ పెరగడంతో ఉన్న స్థలాలకు ఏదోలా కాస్త దారి చూసుకుని అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తే చాలు అనుకుని తమ పని పూర్తి చేసుకుంటున్న ఆక్రమణ దారులకు ఇరిగేషన్ వ్యవస్థ ఎంత ప్రమాదంలో పడినా పట్టడం లేదు. ఇక ఇరిగేషన్ శాఖలో కూడా చేతులు తడవడంతో వీరి భూములకు ధర పెరిగిన వీరి పంట పండుతుంది. అన్నం పెట్టే రైతు పంట ఎండుతుంది.

అక్రమ నిర్మాణాలే ఆయకట్టుకు శాపం

రాజోలు నియోజకవర్గంలో ప్రధాన కూడళ్ల నుంచి వెళ్లే పంట కాలువలపై ఇలా అక్రమంగా వంతెనల నిర్మాణం వల్లే నియోజకవర్గంలో వరి ఆయకట్టు పూర్తి స్థాయిలో ప్రమాదంలో పడింది. మలికిపురంతో పాటు, తాటిపాక, లక్కవరంలో కూడా పరిస్థితి ఇలానే ఉంది. ఫలితంగా మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో సుమారు 5 వేల ఎకరాల వరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇక ముంపు మురుగు నీరు సాగక పోవడం వల్ల మరో పది వేల ఎకరాల్లో వరి నాట్లు సాగడం లేదు. దీనికి పంట విరామం అని ఇరిగేషన్ అధికారులు పేరు పెట్టారు.

అక్రమ నిర్మాణాలు అరికట్టాలి



పంట కాలువలపై అడ్డగోలుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలి. అధికారుల ఉదాసీనత వల్ల, ఆక్రమణదారులు అత్యాశ వల్ల ఆయకట్టు ప్రమాదంలో పడుతుంది. రోడ్లు కాలువ గట్టు ఆక్రమణలకు గుర్రై ఇరుకు మార్గాలు ఏర్పడి ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– గొల్ల శ్యాం, మూలపోడు

కలెక్టర్ ఆదేశాలు వచ్చాక కూల్చేస్తాం



పంటకాలువలపై ఆక్రమంగా పక్కా శ్లాబ్‌లతో వంతెనల నిర్మాణం సాగింది. మలికిపురం ప్రాంతంలో ఇది చాలా తీవ్రంగా ఉంది. అడ్డుకుంటే తమపైనే తిరగబడ్డారు. వందలాది ఎకరాలలో ఆయకట్టు ప్రమాదంలో ఉంది. నీరు అందక వరి నాట్లు ఆగిపోయాయి. దీనిపై నివేదిక జిల్లా కలెక్టర్ వద్ద ఉంది. అక్కడ నుంచి ఆదేశాలు వచ్చాక రెవెన్యూ, పోలీసుల సమక్షంలో కూల్చివేస్తాం.

– బెహరా రమేష్, ఇరిగేషన్ ఏఈ, రాజోలు

క్లుప్తంగా

రోడ్డును అభివృద్ధి చేయాలంటూ వినతి


రోడ్డు అభివృద్ధి చేయాలని వినతిపత్రం ఇస్తున్న జై భీమ్ యూత్ ప్రతినిధులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలోని డైలీ మార్కెట్ నుంచి తోటమెరక వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని, గోతులతో ప్రమాదకరంగా మారిందని జై భీమ్ యువజన సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును అభివృద్ధి చేసి 20 ఏళ్లు అవుతుందన్నారు. ఈ రోడ్డుపై నిత్యం పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ సర్పంచ్ అల్లు విజయలక్ష్మికి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. దీనిపై సర్పంచ్ సానుకూలంగా స్పందించారని యూత్ అధ్యక్షుడు మోకా మధుబాబు, సభ్యులు ఏసుబాబు, రాజేష్, రాజా, మల్లికార్జునరావు, శ్రీనివాస్, జాన్ తెలిపారు.

రహదారి అభివృద్ధి పనుల పరిశీలన


గుమ్మిలేరులో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు నుంచి పినపళ్ల వెళ్లే లింకు రోడ్డు అభివృద్ధి పనులను రామచంద్రపురం డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఎ.రాజు మంగళవారం పరిశీలించారు. ఎన్ఆర్ ఈజీఎస్‌లో మంజూరైన రూ.1.20 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. తొలి దశలో రహదారిని విస్తరించి గ్రావెల్‌తో నింపుతున్నారు. దీంతో పాటు అవసరమైన చోట్ల రైతులకు ఉపయోగపడే విధంగా ఇవతల కాలువ నుంచి పొలాలకు సాగునీరు పారేందుకు తూరలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ఈ రహదారిని తీర్చిదిద్దడంతో పాటు వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. నిర్ణీత సమయంలో ఈ రహదారి పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ


పెదపళ్లలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం అందజేస్తున్న వైద్యాధికారి రామకృష్ణ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ జరిగింది. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో జొన్నాడ, ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, సూర్యారావుపేట, సందిపూడి, చింతలూరు, పెనికేరు, కలవచర్ల గ్రామాల్లో పనిచేస్తున్న 29 మందికి ఇన్‌చార్జి వైద్యాధికారి బి.అనంత రామకృష్ణ అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సందర్భంగా ఇన్‌చార్జి వైద్యాధికారి బి.అనంత రామకృష్ణ స్థానిక ఆశా కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని, జ్వర పీడితులను గుర్తించి సత్వరమే పీహెచ్‌సీలకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ


ఆదర్శ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న డీపీటీఓ రాఘవకుమార్

రావులపాలెం: అత్యధిక ఆదాయం సంపాదించే డిపోల్లో రావులపాలెం డిపో ఒకటని ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు అభినందనలు తెలుపుతున్నట్టు డీపీటీఓ రాఘవ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డిపో ఆవరణలో మేనేజర్ జీజీవీ రమణ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీపీటీఓ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులు అందుకున్న ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. డిపో పరిధిలో అవార్డులు సాధించిన ఉద్యోగులకు మేనేజింగ్ డైరెక్టర్ పంపిన ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపోలో ఉత్తమ ఈపీకే సంపాదించిన కండక్టర్లకు, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు పత్రాలను అందజేశారు. అలాగే గ్యారేజీ సిబ్బందికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్లకు 80 శాతం రాయితీ


డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: వ్యవసాయ పనులకు ఉపయోగించే డ్రోన్లపై ప్రభుత్వం 80 శాతం రాయితీ కల్పిస్తోందని కేంద్ర వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా.కె.రాజశేఖరరావు తెలిపారు. ముక్కామల రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, పంటల సాగు, సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట సాగులో నిర్వహణ వ్యయం తగ్గించుకునేలా ఆధునిక సాంకేతిక పద్ధతులు అలవర్చుకోవాలన్నారు. పంటలపై ఆశించే చీడపీడల నివారణకు డ్రోన్ పరిజ్ఞానం వినియోగించుకోవాలని సూచించారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డా.సంజయ్ హెగ్డే, శాస్త్రవేత్త డా.మాధవన్, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు. భూసార పరీక్షలు, ప్రధాన మంత్రి బీమా యోజన, డ్రిప్ ఇరిగేషన్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఉద్యాన అధికారి ఎం.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్ నియామకానికి తర్జనభర్జన


ఆస్పత్రి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు: రాజోలు ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్ట్ నియామకం కోసం మంగళవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంబంధిత అధికారులతో తర్జనభర్జన పడ్డారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గైనకాలజిస్ట్ నియమించాలని జిల్లా ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే దేవ గతంలో మాట్లాడారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ఎమ్మెల్యే అభివృద్ధి కమిటీ సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. రాజోలు నియోజకవర్గంలో ప్రైవేటుగా సేవలు అందిస్తున్న గైనకాలజిస్ట్ వైద్య నిపుణులను గుర్తించాలని స్థానిక నాయకులకు సూచించారు. ప్రైవేటు గైనకాలజిస్ట్‌ను ఆస్పత్రిలో సేవలు అందించేలా వారికి గౌరవ భత్యం ఇచ్చే విధంగా నిర్ణయించారు. దీంతో గతంలో సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన గైనకాలజిస్ట్‌లతో రాజోలు ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందించేలా చర్యలు జరపాలన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం


ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలిద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

ముక్కామలలో..

అంబాజీపేట: మలేరియా ప్రాణాంతకమైందని, దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేవెల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మలేరియా అంతం మనతోనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలన ద్వారా మలేరియాను అరికట్టవచ్చన్నారు. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

గజమాల యాత్ర విజయవంతం చేయాలి


గజమాల యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

రాజోలు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు సమర్పించే గజమాల యాత్రను విజయవంతం చేయాలని రాజోలు తాలూకా శెట్టి బలిజ సంఘం మంగళవారం పిలుపునిచ్చారు. ఈ నెల 6న అప్పనపల్లి వెళ్లేందుకు సంఘీయులు తరలి రావాలన్నారు. అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా గజమాల యాత్ర చేపడుతున్నామని తాలూకా అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గజమాల యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ సభ్యులు చెల్లుబోయిన శ్రీనివాస్, గుబ్బల రమేష్, శ్రీనివాస్, కాండ్రేగుల సత్యనారాయణ, గుబ్బల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర


వక్కలంక అమ్మవారి జాతరలో ఆకట్టుకున్న గరగ నృత్యాలు

అంబాజీపేట: వక్కలంక గ్రామ దేవతలు ముత్యాలమ్మ, లంకాలమ్మ అమ్మవార్ల జాతర సోమవారం రాత్రి అశేష భక్త జన కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి విశేష సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జాతరలో గరగ నృత్యాలు, పూజ ఘటం ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మంగళ వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. పలువురు ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు సమర్పించారు. గంగలకుర్రు అగ్రహారంలో కొలువైన సిరి రావులమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఆడపడుచులు మొక్కులు, చలివిడి పానకాలు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా సత్తెమ్మ అమ్మవారి జాతర

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక గ్రామపంచాయతీ పరిధిలోని తోటవారిమెరక, ఉంగరాలవారిమెరకలో శేషరాయుడు కాలువ గట్టు సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బుట్టబొమ్మలు, డోలు సన్నాయి, బాణసంచా కాల్పులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రాజోలు నియోజకవర్గ శాసనసభ్యులు దేవ వరప్రసాద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, దిరిశాల బాలాజీ, గంటా నాయుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదే ప్రాంతంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కోళ్ల పాపయమ్మను ఎమ్మెల్యే దేవ పరామర్శించి నాయకులు ఏర్పాటు చేసిన బియ్యం, నిత్యావసరాలను బాధితురాలికి అందజేశారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం


మలికిపురంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సైక్లిస్టులు

మలికిపురం: ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కండి, పర్యావరణ పరిరక్షణ కోసం, కాలుష్య నివారణ కోసం సైకిల్ తొక్కండి అనే నినాదంతో హెల్దీ సైక్లింగ్ గ్రూపు ఆధ్వర్యంలో మలికిపురంలో ఘనంగా సైకిల్ తొక్కుతూ బంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించారు. అనేక మంది సైకిల్ ప్రేమికులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సప్పా నాగేశ్వరరావు (వాకర్స్ క్లబ్ 103 గవర్నర్) జెండా ఊపి ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యం కోసమే పర్యావరణ పరిరక్షణకు సైకిల్ తొక్కడం ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రముఖ వైద్యుడు జాన వీరభద్ర ప్రసాద్, కేసీఎంఎల్ శ్రీనివాస్, కేఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. పలువురు సైకిల్ రిపేర్ చేసే సోదరులను శాలువా స్వీట్ బాక్స్ అందించి ఘనంగా సత్కరించారు. దెందుకూరి రాంబాబురాజు, వివేకానంద ప్రసాద్, బోనం రాజు, నక్కా రమేష్, నల్లి మోహన్‌రావు, తాడి సహదేవ్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పోలిశెట్టి గణేష్, పల్లపోతు, జైదీప్, రత్నరాజు, వలవల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో వంటలు చేయాలి


ఆలమూరులో మిడ్ డే వర్కర్స్‌కు వంటలపై శిక్షణను ఇస్తున్న అధికారులు

ఆలమూరు: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు వీలుగా శుచి, శుభ్రతతో వంటలు చేయాలని ఎంఈఓలు బి.అప్పాజీ, ఎస్‌వీ సుబ్బరాజు అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మిడ్ డే వర్కర్స్ శిక్షణ సదస్సు జరిగింది. మండపేట అగ్నిమాపకదళ, వైద్యారోగ్య, విద్యాశాఖ అధికారులు మధ్యాహ్న భోజనం వడ్డించిన విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మిడ్డే మీల్స్ వర్కర్స్‌తో తయారు చేయించిన వంటలను రుచి చూశారు.

పోషకాల నేరేడు

- ఔషధ గుణాలు అధికం
- వేసవిలో విరివిగా లభ్యం

ఆలమూరు: ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడుపండును తింటే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలు, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు తినడం వల్లే కాదు ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తుంది. నేరేడు గింజలను పొడి చేసుకుని తింటే మధుమేహ నివారణకు దోహదపడుతుంది. నేరేడుపండులో అత్యధిక పోషకాలు ఉన్న దృష్ట్యా పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు తయారు చేసుకోవచ్చు. మన్యం, చాగల్నాడు ప్రాంతాలతో పాటు గోదావరి పరీవాహక లంక భూముల్లో ఈ నేరేడు పండ్లు విరివిగా లభిస్తాయి. రైతు దగ్గర దళారులు కేజీ రూ.80కి కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తారు. వినియోగదారులకు చేతికొచ్చేసరికి రూ.200 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు.

ఖనిజ లవణాలు పుష్కలం



నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. దీనివల్ల శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తుంది. అన్ని వేళల్లో ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది.

– బి.అనంత రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

నేరేడు వల్ల కలిగే ప్రయోజనాలు

- నేరేడుపండ్లతో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కల్పిస్తాయి.
- మూత్రసమస్యల నియంత్రణతో పాటు కిడ్నీలను శుభ్రపరుస్తుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా ఉంటుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి ఈనేరేడు పండు దోహదపడుతుంది.


నేరేడు చెట్టు కొమ్మకు విరగకాసిన కాయలు, పండ్లు

సత్యసాయి దివ్య రథయాత్రకు అపూర్వ స్వాగతం


అంబాజీపేటలో రథానికి పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట చేరుకున్న శ్రీసత్యసాయి ప్రేమ వాహిని రథయాత్రకు మంగళవారం భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక హైస్కూల్ సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద అంబాజీపేట సత్యసాయి జోన్ భక్తుల బృందం ఆధ్వర్యంలో మహిళలు హారతులు పట్టి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దివ్య పాదాలను దర్శనం చేసుకున్నారు. అనంతరం రథయాత్ర పెద్ద వీధిలో ఉన్న వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వరకు అక్కడి నుంచి పశువుల ఆసుపత్రి సమీపంలోని శ్రీసత్యసాయి నగర్ వరకు కొనసాగింది.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సాయం చేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.12,500 ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని రావులపాడుకి చెందిన బైరిశెట్టి శ్రీను (38) రెండు కిడ్నీలు పాడైపోయాయి. రెండు రోజులకి ఓసారి డయాలసిస్ చేయించుకుంటున్నారు. టైలరింగ్ పని చేసుకునే శ్రీనుకు వైద్యానికి, ఇల్లు గడవడానికి కష్టంగా మారింది. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాడులో బైరిశెట్టి శ్రీను ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12,500 చెక్కు అందజేశారు.

అంకితభావంతో పని చేస్తే శాశ్వత గుర్తింపు


తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్డీఓ మాధవి, ఎమ్మెల్యే వరప్రసాద్

రాజోలు: అంకిత భావంతో విధి నిర్వహణ చేస్తే ప్రజల్లో శాశ్వత గుర్తింపు లభిస్తుందని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అన్నారు. రాజోలు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. శివకోడు కాపు కల్యాణ మండపంలో జరిగిన సన్మాన సభలో అమలాపురం ఆర్డీఓ మాధవి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 38 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో సేవలు అందించిన తహసీల్దార్ సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ ఉద్యోగ బాధ్యతల్లో ఒక భాగమన్నారు. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, రాజోలు మండల రెవెన్యూ ఉద్యోగుల సంఘం, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ దంపతులను ఘనంగా సత్కరించారు.

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున సాయం


మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం రావిలంక వద్ద వశిష్ఠ నదిలో ఇటీవల స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన విద్యార్థులు కేతా ప్రవీణ్, సానబోయిన సూర్యతేజ మరణించగా, వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైన ఎక్స్‌గ్రేషియాను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం తన కార్యాలయం వద్ద అందజేశారు. మృతుల కుటుంబాలను ఆయన ఓదార్చారు. వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఇదే ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంకకు చెందిన మరో విద్యార్థి నీతిపూడి ఫాలు కుమార్ మృతి చెందగా, అతడి కుటుంబానికి కూడా సాయం అందించనున్నారు. చెక్కుల పంపిణీలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాగుల్లంక సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.